క్లుప్తంగా

పరిశుభ్రతతో ఆరోగ్య రక్షణ



కేజీబీవీలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

తుని రూరల్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం మెరుగుతో ఆరోగ్యానికి రక్షణ లభిస్తుందన్ని వి.కొత్తూరులో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ అమృతవాణి అన్నారు. స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు మంగళవారం విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్యం, చేతుల శుభ్రపర్చుకోవడంపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమాన్ని టీవీలో విద్యార్థినులు తిలకించారు. అనారోగ్య సమస్యలకు ప్రధాన కారణాలు వ్యక్తిగత, పరిసరాల అపరిశుభ్రతే నన్నారు. భోజనానికి ముందు ఏవిధంగా చేతులు శుభ్రపర్చుకోవాలని ప్రయోగాత్మకంగా వివరించారు. పారిశుధ్యంలో వినియోగించే పనిముట్లు, సామగ్రిని ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



యర్రవరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్పార్క్ చైర్మన్ సాయిసందీప్

ఏలేశ్వరం: సైబర్‌నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్పార్క్ చైర్మన్ సాయిసందీప్ సూచించారు. యర్రవరం గ్రామంలోని విజ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో మంగళవారం సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సాయి సందీప్ మాట్లాడుతూ సైబర్‌నేరాల్లో విద్యార్థుల సంఖ్య పెరగడం ఆందోళన కరమన్నారు. విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు సైబర్ ప్రోలాక్ ప్రాజెక్టు రక్షా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పోలీస్‌శాఖతో కలిసి ప్రతి జిల్లాలో ప్రతిగ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనంతరం మహిళలపై జరుగుతున్న సైబర్‌నేరాలు, స్పై కెమెరా దాడులు, ఫెడెక్స్ కొరియర్ దాడులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పార్క్ కోఆర్డినేటర్స్ రవికిరణ్, ఆదిత్య, సాహుల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి



జగ్గంపేట సీహెచ్‌సీలో మొక్కలు నాటుతున్న డాక్టర్లు

జగ్గంపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్ అన్నారు. జగ్గంపేట సీహెచ్‌సీ ఆవరణలో ప్రణీత్ ఆధ్వర్యంలో ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది, నేరేడు, జామ, మామిడి, జామ తదతర మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డాక్టర్లు అడబాల సుగంధి, మాధురి, తేజ, శ్రావణసంధ్య తదితరులు పర్యావరణ పరిరక్షణలో మొక్కలు పాత్ర గురించి వివరించారు. ప్రజలకు ప్రాణవాయువైన ఆక్సిజన్ లభించాలంటే మొక్కలే కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పరామర్శ



రౌతులపూడి సీహెచ్‌సీలో రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

రౌతులపూడి: గత నాలుగు రోజులుగా డయేరియాతో బాధపడుతూ రౌతులపూడి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న శృంగవరం రోగులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మంగళవారం పరామర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైరల్, టైఫాయిడ్, డెంగీ వంటి వివిధ రోగాలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారు గురించి సీహెచ్‌సీ వైద్యాధికారి జానకీదేవిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలకు ఎక్కువ మంది వస్తున్న కారణంగా ఈ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరంరోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఆమె వెంట టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే ఆసుపత్రిలో రోగులను డీసీహెచ్‌ఎస్ స్వప్న కూడా పరామర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు గురించి తెలుసుకున్నారు.

తగ్గిన వర్షం.. వీడుతున్న ముంపు

- వరద నీరు తగ్గుముఖం
- ముంపులో 2750 ఎకరాలు



హంసవరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కేఎంఆర్ ట్యాంకు కళింగలు



జగ్గంపేట మండలంలో వరిపంటను పరిశీలిస్తున్న మండల అధికారులు

తుని రూరల్: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద ముంపు వీడుతోంది. గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో పంటలు ముంపునకు గురయ్యాయి. మొత్తం 2,750 ఎకరాల్లోని ఖరీఫ్ పంట నీట మునిగినట్టు తుని సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు. మరో రెండు రోజులు పొడి వాతావరణం ఉంటే పూర్తిగా నీటి ముంపు విడిపోతుందన్నారు. అధికారులు ఆదేశించిన వెంటనే పంటనష్టం అంచనాలు రూపొంది స్తామని ఏడీఏ తెలిపారు. పంపా, తాండవ రిజర్వాయర్ల నుంచి అదనపు జలాలు విడుదల చేయడం వల్ల మెట్ట ప్రాంతంలో ప్రధానంగా పంటలు వరద నీటి ముంపునకు గురైనట్టు ఆయన తెలిపారు. మెట్టకు ఈ వర్షాలు మేలు చేశాయన్నారు. ఎగువ నుంచి వస్తున్న వరదనీరుతో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. పంపా వరదనీటి కాలువ నుంచి, పుష్కర కాలువ నుంచి వరదనీరు చేరుతుండడంతో తుని మండలం హంసవరం సమీపంలో ఉన్న 167 ఎకరాల కేఎంఆర్ ట్యాంకు (చెరువు) కళింగలు ఉధృతంగా ప్రవహిస్తుంది. పరివాహ ప్రాంతాలు, తాండవ రిజర్వాయర్ నుంచి అదనపు జలాలు విడుదలతో తాండవ నదీలో వరదనీరు ఉరకలేస్తూ పెంటకోట వద్ద సముద్రంలో కలుస్తుంది.

స్థిరంగా నీటి నిల్వలు

నదుల్లోని అదనపు జలాలు విడుదల చేస్తున్నారు. అయినా క్యాచ్‌మెంట్ ఏరియాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో పంపా, తాండవ రిజర్వాయర్లలో నీటి నిల్వలు స్థిరంగా ఉన్నాయి. గడచిన శుక్ర, శనివారాలు గరిష్టస్థాయికి నీటి నిల్వలు చేరాయి. దీంతో ఆదివారం పంపా నుంచి 220 క్యూసెక్కులు, తాండవ క్రస్ట్ గేట్ల నుంచి 2426 క్యూసెక్కులు నీరు సముద్రానికి విడుదల చేశారు. ప్రస్తుతం తాండవ రిజర్వాయర్‌లో 377.59 అడుగులు, పంపా రిజర్వాయర్‌లో 98.88 అడుగులు వద్ద స్థిరంగా నీటి నిల్వలు ఉన్నాయి. ప్రాజెక్టుల భద్రత దృష్ట్యా నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పెరగకుండ అధికారులు అప్రమత్తతో పర్యవేక్షిస్తున్నారు.

జగ్గంపేటలో 400 ఎకరాలల్లో ముంపు

జగ్గంపేట: నాలుగు రోజులు కురిసిన భారీ వర్షాలకు మండలంలో 400 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. కష్టపడి వేసిన పంట నీటపాలైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీట మునిగిన పంటను తక్షణం కాపాడుకొనేందుకు రైతులు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు తెలిపారు. మండలంలోని నీట మునిగిన వరి పంటను తహసీల్దార్ జేవీఆర్ రమేష్, మండల వ్యవసాయ అధికారి శ్రీరామ్ మంగళవారం పరిశీలించారు. మండలలో జగ్గంపేట, రామవరం, మల్లిపాక, మామిడాడ తదితర ఆరు గ్రామాలలో వరిపంట ఎక్కువగా నీటమునిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా పంటను కాపాడుకొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ అధికారి శ్రీరామ్ రైతులకు వివరించారు. ప్రస్తుతం వరిపంట నాట్లు వేసి 20 నుంచి 40 రోజులు అయిందని, నాలుగు రోజులు దాటి నీరు పంట నీటిలో ఉండకూడదన్నారు. తక్షణమే నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేయాలన్నారు. లేదంటే తెగుళ్ల ఆశించే అవకాశం ఉందన్నారు. అనంతరం రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు.

అంతా బురదమయం

- సరిహద్దు రహదారిపై ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



బురదతో ప్రమాదకరంగా ఉన్న తుని నుంచి ఎస్.అన్నవరం శేషాద్రి నగర్ సరిహద్దు రోడ్డు

తుని రూరల్: ఎస్.అన్నవరం శివారు ప్రాంతాలైన శేషాద్రినగర్, నల్లగొండమ్మతల్లి ఆలయ సమీప లేఅవుట్లు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ అందుకు అనువుగా రహదారులు మెరుగుపడలేదు. కొద్దిపాటి వర్షం కురిసినా తుని పట్టణం సాయినగర్, ఎస్.అన్నవరం శివారు ప్రాంతాల్లో ప్రయాణం నరకంగా మారుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. తుని పట్టణం విస్తరించే అవకాశాలు లేకపోవడంతో పట్టణాన్ని ఆనుకుని ఉన్న ఎస్.అన్నవరం శివారు భూముల్లో లేఅవుట్లు వేస్తున్నారు. ఇప్పటికే వందలాది ఎకరాలు ఇళ్లస్థలాలుగా విభజించి విక్రయించడంతో స్థోమత ఉన్నవాళ్లు ఇళ్ల నిర్మించుకుని కాపురాలు ఉంటున్నారు. అక్కడికి వెళ్లాలంటే తుని ఎల్ఐసీ ఆఫీస్ పక్క రోడ్డే ప్రధాన రహదారి. మార్గం మధ్య సరిహద్దుల్లో రోడ్లు, కాలువలు లేకపోవడంతో వర్షపునీరు నిలిచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ప్రధాన రోడ్డు, కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన



లంపకలోవలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యప్రభ

ప్రత్తిపాడు రూరల్: అల్పపీడన ప్రభావంతో విస్తృతంగా కురిసిన వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి గంగాధర్‌తో కలిసి తహసీల్దార్ సూర్యప్రభ సోమవారం పరిశీలించారు. మండలంలోని పోతులూరు, యూజే పురం గ్రామాల్లో క్షత్ర స్థాయిలో ఆమె పంటను పరిశీలించారు. మండల వ్యాప్తంగా 800 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణపతి మంటపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి



గోకవరంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎస్సై పవన్‌కుమార్

గోకవరం: రానున్న గణపతి నవరాత్రులకు మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని గోకవరం ఎస్సై పవన్‌కుమార్ అన్నారు. గోకవరం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం గణపతి ఉత్సవాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, ఘర్షణలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్సులు వంటివి నిర్వహించకూడదన్నారు. అలాగే కమిటీ సభ్యులు పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు.

వ్రత పురోహితులకు సత్కారం



వ్రత పురోహితులను సత్కరించిన దృశ్యం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం వ్రత విభాగంలో పని చేసి పదవీ విరమణ పొందిన ఐదుగురు పురోహితులను వ్రత పురోహిత సంఘం మంగళవారం ఘనంగా సన్మానించింది. సంఘం అధ్యక్షుడు, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పురోహితులు దేవస్థానానికి అందించిన సేవలు మరువలేవని అన్నారు. వారు చేసిన సరీ్వసు అనుసరించి గ్రాట్యుటీని స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితులు నాగాభట్ల వీరభద్రశర్మకు రూ.4.60 లక్షలు, మొక్కరాల రామకృష్ణకు రూ.4.20 లక్షలు, దేవులపల్లి భాస్కర్‌కు రూ.3.20 లక్షలు, సెకండ్ గ్రేడ్ వ్రతపురోహితులు భాగవతి వెంకటా చలపతికి రూ.రెండు లక్షలు, కనకదండి బాల సుబ్రహ్మణ్యానికి రూ.1.30 లక్షలు చెక్కులను ఈఓ అందజేశారు. పదవీ విరమణ చేసిన పురోహితుల దంపతులకు రూ.పది వేలు చొప్పున నగదు, నూతన వస్త్రాలతో వ్రతపురోహిత సంఘం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కన్నబాబు, స్పెషల్‌గ్రేడ్ పురోహితులు ప్రయాగ అంజిబాబు, మంధా రాంబాబు, ఛామర్తి జగ్గారావు, తొయ్యేటి హరిబాబు, మాజీ అధ్యక్షుడు రవిశర్మ, ఏఈఓ పాలంకి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అందుబాటులో సింగిల్ విండో విధానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై

గండేపల్లి: గణేష్ ఉత్సవాలకు సింగిల్ విండో విధానం అందుబాటులో ఉందని ఎస్సై యూవీ శివ నాగబాబు తెలిపారు. రానున్న వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించి వీర్వోలు, మహిళా పోలీసులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సింగిల్ విండో విధానంతో ఉత్సవాలకు అనుమతులు సులభతరం చేయడానికి ప్రత్యేక పోర్టల్‌తో పాటు చాట్ బాట్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. 79950 95800 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయి అని సందేశం పంపిస్తే ఎన్‌ఓసీ పత్రం కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం వాట్సాప్‌కు వస్తుందన్నారు. ఈ విధానంతో గణేష్ ఉత్సవాల నిర్వాహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనాలకు మీ-సేవలో చలానా రుసుంను చెల్లించి, నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) క్యూఆర్ కోడ్‌ను పొందవచ్చునన్నారు. సింగిల్ విండో విధానంలో వివరాలు పూర్తిచేసి అనుమతులు పొందాలన్నారు. ఈ కోడ్‌ను అధికారులు తనిఖీ చేయాలన్నారు. ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు జీతాలు పెంచండి



పి.మల్లాపురం పీహెచ్‌సీలో వైద్యుడు సందీప్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

శంఖవరం: ఎన్నో ఏళ్లుగా వైద్య రంగంతో పని చేస్తూ రోగులకు సేవలందిస్తున్న ఆశా కార్యకర్తల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. మండలంలోని శంఖవరం, పి.మల్లాపురం పీహెచ్‌సీలో నిరసన తెలియజేసి వైద్యులు ఆర్‌వీవీ సత్యనారాయణ, సందీప్‌లకు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం, అధికారులు గుర్తించి పరిష్కరిస్తారని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆశాలు ఈగల అమ్మాజీ,దంగేటి అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

6 లోపు స్పందించకుంటే మద్యం దుకాణాల బంద్



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు



జగ్గంపేటలో డీటీ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

గండేపల్లి: ఈ నెల 6వ తేదీ లోపు ప్రభుత్వం స్పందించకపోతే మరుసటి రోజు 7న ప్రభుత్వ మద్యం దుకాణాలను బంద్ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ ఒకటి నుంచి మద్యం దుకాణాలను పూర్తిగా ప్రైవేటీకరణ చేస్తున్నట్టు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తక్షణమే స్పందించాలన్నారు. లేదంటే రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ మద్యం దుకాణాలను బంద్ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాయడం రాశామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ దివ్యభారతి, ఎస్సై శివ నాగబాబుకు వినతి పత్రం అందజేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

జగ్గంపేట: ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్‌లో పని చేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లో పనిచేసే 18 వేల మందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఉద్యోగుల జగ్గంపేటలో మండల అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం నేతలు మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన మద్యం దుకాణాలు బంద్ చేసి శాంతియుతంగా తమ నిరసనను ప్రభుత్వానికి తెలియచేస్తామని అన్నారు. గత ప్రభుత్వం 2019లో 3600 మద్యం దుకాణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించి 18వేల మందిని ఎంపిక చేసి ప్రభుత్వ మద్యం దుకాణాలలో జీవనోపాధి కల్పించిందని తెలిపారు. నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వం దుకాణాలను ప్రైవేట్ పరం చేసి అన్యాయం చేయాలనుకుంటుందన్నారు. దీనివల్ల కార్మికులు జీవనోపాధి కోల్పోతారని, ప్రభుత్వం దీనిని దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలన్నారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జగ్గంపేటలో డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావుకు, జగ్గంపేట సీఐ లక్ష్మణరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలలో పని చేసే సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి గంగాధర్ అన్నారు. మండలంలోని లంపకలోవ, ఒమ్మంగి, రాచపల్లి రైతు సేవా కేంద్రాల్లో 10 టన్నుల చొప్పున 30 టన్నులు, ధర్మవరంలో 20 టన్నులు, యూజే పురంలో 7 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దొంగ చేతికి తాళం ఇచ్చినట్టే..

- తాళం కప్ప కనిపించేలా వేయొద్దు
- కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ



తాళంకప్ప కనిపించేలా వేయవద్దని వివరిస్తున్న సీఐ చైతన్యకృష్ణ

కాకినాడ రూరల్: ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు తలుపులకు తాళంకప్ప కనిపించేలా వేస్తే.. దొంగ చేతికి తాళం ఇచ్చినట్టే అవుతుందని కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ అన్నారు. ఇంటి యజమానులు లేరని గమనించి చోరీలకు పాల్పడేందుకు దొంగలకు ఆవకాశం కలుగుతుందన్నారు. సర్పవరం జంక్షన్ వద్ద రూరల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఇంద్రపాలెం పీఎస్ పరిధిలో కొవ్వాడ, తిమ్మాపురం పీఎస్ పరిధిలో దొంగతనాలు జరిగాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చోరీల నియంత్రణ కోసం ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు రాత్రి పూట గస్తీలు నిర్వహిస్తున్నామన్నారు. కాకినాడ సెమీ అర్బన్ ఏరియాలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. ఇంటికి తాళంకప్ప బయటకు కనిపించే చోటే ఎక్కువగా చోరీలు జరిగినట్టు గుర్తించామన్నారు. ప్రధాన ద్వారం తాళం కనిపించకుండా, కనీసం కర్టెన్ అయినా వేయాలన్నారు. ఊరు వెళ్లేటప్పుడు బంగారు, వెండి వస్తువులు, నగదు ఇంట్లో ఉంచరాదన్నారు. బంధువుల ఇళ్ల వద్ద కానీ, లాకర్లలో కానీ భద్రపర్చుకోవాలన్నారు. కనీసం పోలీసు వారు కల్పించే లాకర్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలన్నారు. ప్రజలు ఇవేమీ పట్టించుకోకుండా, ఇంట్లో విలువైన వస్తువులు పెట్టి వెళుతున్నారన్నారు. ఇళ్ల వద్ద, కాలనీల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు బంగారు ఆభరణాలు వేసుకుని వెళ్లినప్పుడు చైన్ స్నాచర్ల ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో బీట్లు పెంచి, నిఘా ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఇంద్రపాలెం, తిమ్మాపురం ఎస్సైలు మణికుమార్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై మౌనిక

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై మౌనిక అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామ హైస్కూల్‌లో మంగళవారం పాఠశాల విద్యార్థులకు ఆత్మరక్షణ-కర్తవ్యం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ కొత్త చక్రరావు అధ్యక్షత వహించారు. ఎస్సై మౌనిక మాట్లాడుతూ, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యతో పాటు క్రీడలు, సామాజిక అంశాలపై మక్కువను పెంచుకోవాలన్నారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలపై అవగాహన పెంచుకుని, విద్యార్థులు మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థి చట్టాలు, న్యాయ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విజ్ఞానంతో మంచి భవిష్యత్తు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వసంతకుమార్

ఏలేశ్వరం: కంప్యూటర్ విజ్ఞానంతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని విప్రో సంస్థ టీం లీడర్ డి.వసంతకుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంప్యూటర్‌విద్యపై కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా కంప్యూటర్ రంగంలోనే ఉన్నాయన్నారు. కంప్యూటర్ కోర్సులతో విద్యార్థులకు మంచి అవకాశాలు ఉంటాయన్నారు. కంప్యూటర్ విజ్ఞానం లేనిదే నేటి సమాజంలో రాణించడం కష్టమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.సునీత, వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, ఎన్ఎస్ఎస్ పీఓ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు మదీనా, శ్రీలక్ష్మి, మేరీ, రామారావు, సురేష్, శివప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



ఆరుగుల మోషే

కోటనందూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో కొన్ని ప్రాంతాల్లో వరి పొలాలు నీట మునిగి రైతులు నష్ట పోయారన్నారు. వారం రోజులుగా పొలాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల పంటలు కుళ్లి పోయాయన్నారు. ముఖ్యంగా తాండవనది పరివాహక ప్రాంతాల్లో పొలాలు ముంపుబారిన పడ్డాయన్నారు. సంబంధిత అధికారులు మండల వ్యాప్తంగా పర్యటించి నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

లక్ష్మణరావుకు సన్మానం

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో మంగళవారం సబ్ ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్ భజంతుల లక్ష్మణరావు పదవీ విరమణ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ లక్ష్మణరావు 35 సవంత్సరాల విధినిర్వహణలో అంకితభావంతో పని చేయడం అభినందనీయమన్నారు. శేషజీవితం ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నట్టుతెలిపారు. కార్యక్రమలో ఏఎంసీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, అంబటి రాంబాబు, మాజీ సర్పంచ్ విశ్వేశ్వరరావు, ముత్యాల రాంబాబు, మదినే దొరబాబు, పోలిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు భోజనం ప్యాకెట్లు



వాహనాన్ని ప్రారంభించిన నవీన్ కుమార్

జగ్గంపేట: విజయవాడలోని వరద బాధితులకు జగ్గంపేటలోని జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ 40వేల ఆహార పొట్లాలు, లక్ష వాటర్ ప్యాకెట్లు మంగళవారం తరలించింది. జగ్గంపేటలో ఆహార పొట్లాలు,వాటర్ ప్యాకెట్లు తీసుకువెళుతున్న వాహనాలను జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. వరద బాధితులకు సహకరించేందుకు జ్యోతుల ఫౌండేషన్ కార్యకర్తలు కూడా విజయవాడ తరలివెళ్లారు.